

**వైట్‌ఫీల్డ్ పేపర్స్ అధినేత శ్రీనివాసరావుతో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి లక్ష్మీ పార్థసారథి. చిత్రంలో ముఖ్యమంత్రి వైఎస్, మంత్రి గీతారెడ్డి తదితరులు ఉన్నారు.**

హైదరాబాద్ - న్యూస్‌టుడే

పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు సమీపంలో రూ.1200 కోట్ల వ్యయంతో కొత్తగా పేపరు మిల్లు ఏర్పాటు కానుంది. బయ్యావరం గ్రామం వద్ద వైట్ ఫీల్డ్ పేపర్స్ సంస్థ దీనిని నెలకొల్పుతోంది. ఈ మిల్లువల్ల వేయి మందికి ప్రత్యక్షంగానూ 10వేల మందికి పరోక్షంగానూ ఉపాధి లభించనుంది. ఏడాదికి రెండు లక్షల టన్నుల పేపరును ఉత్పత్తి చేయనున్న ఈ సంస్థ ప్రమోటర్లందరూ ఆంధ్రులే కావడం విశేషం. సోమవారం హైదరాబాద్‌లో ఈ మిల్లుకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది. పరిశ్రమలశాఖ మంత్రి గీతారెడ్డి, వైట్ ఫీల్డ్ పేపర్స్ ఛైర్మన్ టి.శ్రీనివాసరావు, మేనేజింగ్ డైరెక్టరు ఎం.టి.శ్రీనివాసరావు, సాంకేతిక సలహాదారు వి.చక్రపాణి తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మిల్లు స్థాపనకు మొత్తం 500 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించనున్నట్లు ఈ సందర్భంగా వైఎస్ తెలిపారు. మొదటి దశ కింద రెండు, మూడు నెలల్లో 250 ఎకరాలను ఇస్తామని చెప్పారు. 'ఈ పేపరు మిల్లు స్థాపనలో రెండు విశేషాలున్నాయి. ఒకటి పెట్టుబడిదారులు రాష్ట్రానికి చెందినవారే కావడం. రెండోది పేపరు తయారీకి అవసరమైన ముడి గుజ్జు(పల్ప్) మొత్తాన్ని స్వీడన్ నుంచి దిగుమతి చేసుకోవడం' అని ముఖ్యమంత్రి వెల్లడించారు. తయారైన పేపరులో 60శాతం తిరిగి విదేశాలకే ఎగుమతి అవుతుందని ఆయన పేర్కొన్నారు. డిసెంబరు నాటికి పర్యావరణ అనుమతులు వస్తాయని, 2007 జనవరిలో ఫైనాన్షియల్ క్లోజర్ పూర్తవుతుందని, ఆనక ట్రయల్ రన్ పూర్తి చేసుకుని 2008 డిసెంబరు నాటికి వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభిస్తుందని తెలిపారు. మిల్లుకు అవసరమైన విద్యుత్తు ఉత్పత్తి కోసం 40 మెగావాట్ల కో-జనరేషన్ ప్లాంట్‌ను నెలకొల్పనున్నామని వైట్ ఫీల్డ్ ఛైర్మన్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రమోటర్ల వాటాగా రూ.250 కోట్లు, పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.200 కోట్లు సమీకరించి మిగిలిన మొత్తాన్ని ఆర్థిక సంస్థల ద్వారా పొందుతామని తెలిపారు.